

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 12 పుష్పం : 13 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, విశాఖపట్నం, 2-12-98)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు అరుణాచల దిపోత్సవం. బ్రహ్మదేవుడికి, విష్ణుదేవుడికి నేను గొప్ప నేను గొప్ప అని అహంభావన కలిగితే వారి అహంభావన తొలగించటం కోసం ఈశ్వరుడు జ్యోతి రూపంలో బ్రహ్మదేవుడికి, విష్ణుదేవుడికి దర్శనమిచ్చినరోజు. బ్రహ్మ విష్ణువుల కోరికపై ఈశ్వరుడు జ్యోతిరూపమును ఉపసంహరించి మొదట గిరిరూపమును, తరువాత లింగరూపమును ధరించాడు. తొలి లింగం అరుణాచల లింగం. లింగం అంటే గుర్తు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే గుర్తుకోసం పరమేశ్వరుడు లింగరూపం ధరించాడు. మనహృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు. అయితే ఆయన మన మనస్సుకు, వాక్కుకు అందడు. ఎవడివాక్కు నిర్మలం అయ్యిందో శుద్ధమయ్యిందో, ఎవడి మనస్సు నిర్మలం అయ్యిందో పవిత్రం అయ్యిందో పవిత్రమైన మనస్సుకు శుద్ధమైన వాక్కుకు ఈశ్వరుడు అందుతాడు గాని స్థూలబుద్ధి ఉన్నవాడికి అందడు. మనకు స్థూలబుద్ధి ఉంది. స్థూలబుద్ధి ఉన్నవాడికి ఈశ్వరుడు హృదయంలో ఉన్నా ఈశ్వరసాక్షాత్కారము కాదు. మన మనస్సు అణిగి దానికి అంతర్దృష్టి కలిగి అది హృదయంలో ప్రవేశిస్తేనేగాని మనస్సు నశించదు. మనస్సు నశిస్తేనేగాని మనకు సత్యం తెలియదు. సత్యం తెలిస్తేనేగాని మనకు స్వేచ్ఛలేదు, ఆనందం లేదు.

అరుణచల మనుచు స్మరియించువారల
అహము నిర్మూలింతు వరుణాచలా

రమణమహర్షి అక్షరమణమాలలో ఈమొదటి ద్విపదలో అరుణాచలం, అరుణాచలం అని ఎవరైతే నిరంతరము మనస్సులో స్మరించుకొంటున్నారో ఎవరైతే మనస్సులో నిరంతరము ధ్యానించుకొంటున్నారో వారిలో ఉన్న అహంభావనను వెంటనే అరుణాచలేశ్వరుడు తొలగిస్తాడు అని చెప్పవలసినదంతా మొదటి ద్విపదలోనే చెప్పి మిగతా విషయాలు అన్ని వివరంగా మిగతాద్విపదలలో చెప్పాడు. మనం తరించటానికి మొట్టమొదటి ద్విపదచాలు. అరుణాచలాన్ని స్మరిస్తే చాలు, ముక్తికలుగుతుంది. మనమనస్సులో దోషాలు ఉంటే స్మరించాలనే బుద్ధి కూడా కలుగదు. భగవంతుడు చెప్పిన ప్రతీమాట సత్యమే. కాని మనవాసనల యొక్క వేగం ఆమాటలను అర్థం చేసుకోనివ్వదు. మనవాసనలు మనలను భ్రాంతిలోపెడతాయి. అప్పడు మనతలంపులే నిజం అనిపిస్తాయి, భగవంతుడు చెప్పినది అనిజం అని మనకు అనిపిస్తుంది. ఇది మన మనస్సులో ఉన్నదోషం. ఎంతో కృషిచేస్తేనేగాని భగవదనుభవం కలుగదు కాని నన్ను శారీరకంగాను, మానసికంగాను ఇబ్బందులకు గురిచేయకుండా నాఅహంభావనను

తీసుకొని నీస్వరూపాన్ని నాకు ఇచ్చావు. భక్తుడి పట్ల నీకు ప్రేమ, దయ, వాత్సల్యం ఉన్నాయి కాబట్టి నీవు ఇలా చేసావు అని అరుణచలేశ్వరుడితో భగవాన్ అన్నారు. అరుణాచలాన్ని లాంఛనంగా స్మరించటం వేరు, లోపల హృదయంలో నుండి స్ఫురణ కలగటం వేరు. మనహృదయంలో నుండి ఆస్ఫురణ కలిగితే ఈజన్మలోనే తరిస్తాము.

ద్వైవమనుచు నిన్ను దరిజేరగా నన్ను
పూర్ణనాశమొనర్చి తరుణాచలా

నేను ద్వైతబుద్ధితో నిన్ను సమీపించగ, నీవు దేవుడవని నీదగ్గరకు వస్తే నీవు ఏమి చేసావు అంటే నాలోని ద్వైతబుద్ధిని తొలగించి అద్వైత బుద్దిని కలుగజేసి అమృతత్వమును నాకు అనుభవంలోనికి వచ్చేటట్లు చేసావు.

ఎక్కువగా మాట్లాడటం వలన, అనవసరమైన మాటలు మాట్లాడటం వలన మనస్సు విజృంభిస్తుంది. మాటలు మితంగా మాట్లాడటంవలన, హితవుగా మాట్లాడటంవలన అది మనోనిగ్రహానికి సహకరిస్తుంది. మనోనిగ్రహం సాధించాలంటే ఎక్కువ ఆలోచించి తక్కువ మాట్లాడటం మంచిది. అరుణాచలం శాంతినిచ్చేకొండ, జ్ఞానాన్ని ఇచ్చేకొండ. అరుణాచలాన్ని స్మరించటం వలననే అద్వైతసిద్ధి కలుగుతుంది. ఓఅరుణాచలేశ్వరుడా! నీవు చిరకాలం ఉండాలి. ఇలాంటి శరీరాలు ఎన్నో వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. నీవుచిరకాలం ఉండి ఎవరైతే నిన్ను స్మరిస్తున్నారో ఆజీవకోటినందరిని తరింపచేయవలసిన బాధ్యత నీమీద ఉంది అని అక్షరమణమాలలో రమణమహర్షి అరుణాచలేశ్వరుని ప్రార్థించారు.

ఇప్పడు మనం ప్రపంచానికి దగ్గరగా ఉన్నాము, జీవలక్షణానాలకు దగ్గరగా ఉన్నాము. దేవునికి దూరంగా ఉన్నాము. సత్పురుషుల సాంగత్యం మనలను ప్రపంచానికి దూరం చేస్తుంది, దైవానికి దగ్గర చేస్తుంది. సత్పురుషుల సహవాసం వలన మనలో ఉన్న పునర్జన్మవాసనలు నశిస్తాయి. పవిత్రమైన గ్రంధాలు చదవటంవలన నీకు పవిత్రమైన ఆలోచనలు వస్తాయి. పరమపవిత్రులతో సాంగత్యంవలన వారినుండి వచ్చేశక్తి తరంగాలు, కాంతి తరంగాలు నీబుద్ధి మీదపనిచేస్తాయి, దానిని భగవంతునివైపుకు త్రిప్పతాయి. కళ్లతో చూసే విషయాలలో, చెవులతో వినేవిషయాలలో, చేసే స్నేహల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అవసరంలేని విషయాలు ఆలోచిస్తూఉంటే, మాట్లాడుతూఉంటే అహంభావన పూర్తిగా మనలను ఆక్రమించుకొంటుంది. నీకు వచ్చే తలంపులు, నీవు చేసేపని, నీవు మాట్లాడేమాట బంధంలోనుండి విడుదలపొందటానికి సహకరించాలి. మనలో ఉన్న బలహీనతలు పూర్తిగా తొలగేవరకూ జన్మలు వస్తూనే ఉంటాయి. భగవంతుడు జన్మలు ఎందుకు ఇస్తున్నాడు అంటే మనలోని బలహీనతలు తొలగించుకోవటానికే జన్మలు ఇస్తున్నాడు. నీవు పెద్దపెద్ద సాధనలు చేయలేకపోయినా సత్పురుషులతో సహవాసంవలన నీలోని వాసనలు నశిస్తాయి.

ఇప్పడు దేహము నేను అనే భావన నీకు ఎంతబలంగా ఉందో ఆత్మవిచారణచేస్తే ఆత్మను నేను అనే భావన నీకు అంతబలంగా కలుగుతుంది. ఇందులో సందేహం లేదు, చేసిచూడు అంటున్నారు. నీహృదయంలో సత్యవస్తువు ఉంది. నీకుయుక్తుల నుండి, దురలవాట్లనుండి విడుదల పొందితే లోపల ఉన్న వస్తువు సహజంగా నీకు వ్యక్తమవుతుంది. మనస్సు, మాట,

చేత ఇవి మూడూ నిదానంగా ఉండాలి. అప్పుడు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. ఎప్పుడైతే ఈశ్వరానుగ్రహానికి పాత్రులయ్యారో అప్పుడులోపల ఉన్నవస్తువు నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. ఎవరిని చూసి అసూయపడవద్దు. అలా అసూయపడితే అదే మనకు ఎదురువస్తుంది. ఏదో ఒకమంచి గుణాన్ని మీరు ప్రాక్టీసు చేయండి. మిగిలిన మంచిగుణాలు అన్నీ వచ్చేస్తాయి. గీతాసారమును రెండు ముక్కలలో చెప్పండి అని ఒకరు భగవాన్‌ను అడిగారు. దేహప్రారబ్ధమును బట్టి ఒకోమనిషికి ఒకో పనిని భగవంతుడు ఇస్తాడు. నీవు చేసే పనిని అయిష్టంగా చేయవద్దు. ఇష్టంగా ప్రేమతో చెయ్యండి. అలాచేస్తే పాతవాసనలుపోతాయి, క్రొత్త వాసనలు రావు అని భగవాన్‌చెప్పారు. అలా చేయటం వలన నీవు చేసేపని మోక్షం పొందటానికి సహకరిస్తుంది. నిష్కామకర్మవలన భక్తి కలుగుతుంది. ఎప్పుడైతే భక్తి కలిగిందో జ్ఞానం కలగటానికి అది సహకరిస్తుంది. ఎప్పుడైతే జ్ఞానం కలిగిందో అప్పుడు ఈశ్వర స్వరూపమును పొందుతావు. అందువలన చేసే పనిని ఇష్టంగాచెయ్యి, నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చెయ్యి. కర్మఫలాన్ని ఆశించవద్దు. కర్మఫలాన్ని ఆశిస్తే పునర్జన్మ వచ్చితీరుతుంది. కొంతమంది పని తప్పించుకోవటానికి చూస్తారు. ఏపని అయితే మనం తప్పించుకొంటున్నామో వచ్చే జన్మలో ఆపనే మనకు భగవంతుడు అప్పగిస్తాడు. ఇది జ్ఞాపకం పెట్టుకోండి.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, విశాఖపట్నం 3-12-98

రమణమహర్షికి బాహ్యంగా గురువు లేడు. కాని ఆయనకు అరుణాచలేశ్వరుడే గురువు. గురువు అవసరంలేదు అని ఆయన దగ్గర ఎవరైనా అంటే మీకు అవసరం లేకపోవచ్చు ఇతరులకు గురువు అవసరంలేదు అని మీకు ఎలా తెలుసు అనేవారు. గురువు వలన మనకు గైడెన్స్ వస్తుంది. అక్షరమణమాలలో రమణమహర్షి అరుణాచలేశ్వరుని ప్రార్ధిస్తూ అనేకద్విపదలు చెప్పారు. ఆద్విపదలు ఆయనకు ఎందుకు. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు మనోకల్పితములు అని చెప్పిన రమణాచార్యుడికి ఈద్విపదలు అక్కరలేదు. ఇవి మనకోసం చెప్పబడ్డాయి.

కుట్రమంతయు గోసి గుణముగ పాలించు
గురు రూపమై వెలుగరుణాచలా

నాలోని కుట్రను అంటే దుర్గుణాలను తొలగించి నన్ను సద్గుణాలతో అలంకరించు అని అరుణాచలేశ్వరుని ప్రార్ధించారు. భగవంతుని స్మరించటం వలన మనలో ఉన్న దుర్గుణాలను ఆయన తీసేసుకొంటాడు. మోక్షస్థితిని పొందటంకోసం మనలో అడ్డుగా ఉన్న జీవలక్షణాలను, మన మనస్సులో ఉన్న వికారములను తొలగిస్తాడు. మనలను సద్గుణాలతో దైవీసంపదతో అలంకరిస్తాడు.

మనం పనులు చేస్తాము వాటిని తలపెట్టుకొంటూ ఉంటాము. అలా గుర్తుపెట్టుకోవటం వలన అహంభావన పెరుగుతుంది. మంచిచేయాలి, చేసి మర్చిపోవాలి. అప్పుడు ఇహం వస్తుంది, పరం వస్తుంది. ఏదైనా ఒక మంచిపని గౌరవం ఆశించిచేసారు అనుకోండి గౌరవం వస్తుంది.